


# అనుక్షణం

## - సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

### (గతసంచిక తరువాయి)

"**ఇప్పుడున్న పరిస్థితి గురించి** చెబుతున్నాను. ఇంతకు ముందు జనం డబ్బులు మూటలు కట్టేవారు. ఎప్పుడయితే నోట్లు రద్దు చేశారో, బ్యాంకులు కూడా దివాళా తీస్తున్నాయో, మన డిపాజిట్లకు గ్యారంటీ లేదు అంటున్నారో అప్పుడు అందరి దృష్టి మారింది. అలాగే బంగారం కూడా ప్రమాదం. అందుకని భూములు మీద పడ్డారు. విపరీతంగా కొంటున్నారు. ఎందుకంత వేలం వెర్రో అర్థం కావటం లేదు".

"మనుషులు పెరుగుతారు. భూములు పెరగవు అనే సిద్ధాంతం వుందిగా!"

"నిజమేగా. ఇక్కడో పాయింట్ వుంది. మనం ఇప్పుడు ఏదీ కాపాడుకునే స్థితిలో లేం".

"అంటే... "

"హైదరాబాద్ లో భూముల గురించి నీకు తెలుసు".

"ఇక్కడ చాలా వివాదాలు వున్నాయి. ఎలాంటి గొడవలు లేని భూమి దొరకటం ఓ అదృష్టం" అన్నాడు వెంకటాద్రి.

"భూమి మాత్రమే కాదు. అది ఇల్లు కావచ్చు. అపార్ట్ మెంట్ కావచ్చు. ఓ ఇరవై సంవత్సరాలు వున్నాక కూడా మనకు నోటీసులు రావచ్చు. అందులోనూ బెంగళూరు అంటున్నారు. ఆలోచించుకో".

"అంటే... "

"మనం దగ్గర్లో వుంటే అప్పుడప్పుడు వెళ్లి చూసుకోవచ్చు. అంత దూరం అంటే కష్టం. అయినా భూ మాఫియాలు దేశమంతటా వున్నాయ్".

వెంకటాద్రి ముఖంలో నిరాశ కనిపించింది.

"నేను జనరల్ గా చెబుతున్నాను. ఇది వెంచర్. అందులోనూ వ్యక్తులుగా కాదు తీసుకునేది. కంపెనీ కాబట్టి అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. సెక్యూరిటీ వుంటుంది. నేననుకోవటం ఇది ఎక్కువ రోజులు వుంచరు. డెవలప్ చేసి అమ్ముతారు. ఇంకో వెంచర్ తీసుకుంటారు. నువ్వు వారితో కంటిన్యూ అవవచ్చు".

"అయితే మంచిదే అంటావు!"

"అది ఎదుటివారిని బట్టి వుంటుంది. నిరంజన్ గురించి నీకు తెలిసి వుంటుంది. లిబరల్ గా వుంటాడు. ఓ రకంగా ఈ రోజుల్లో మంచి జీతం అనుకోవచ్చు. అయితే ఇక నుండి మన వాకింగ్ బ్రేక్ అవుతుంది".

"అదేంటి?"

"ఇక నుండి అయిదు గంటలకి ఆఫీస్ ముగించుకుని రావటానికి వీలుండదు. నిన్ను బెంగళూరు తిప్పుతాడు. ఇంకో సిటీకి పంపిస్తాడు".

"నేను పెట్టుబడి పెట్టకపోతే?"

"పెట్టకపోయినా అంతే. నిన్ను మాగ్జిమమ్ ఉపయోగించుకుంటాడు. అంతగా అయితే కాస్త జీతం పెంచుతాడు".

"ఇంకేంటి విశేషాలు?"

"విశేషాలు చాలా వున్నాయి. అవన్నీ నీకు నచ్చవు. ఈ రోజు ఓ మంచి పుస్తకం వచ్చింది. ఇంటికి వెళ్లాక అది చదువుతాను".

"అంత మంచి పుస్తకమా?"

"ఆరుగురు అనుమానితులు అని తెలుగులో అనువాదం చేశారు. అంతకు ముందు అతని కథతో స్లమ్ డాగ్ మిలియనీర్ సినిమా తీశారు".

"విన్నాను. ఆ సినిమాని నేను చూడలేదు. ఆస్కార్ అవార్డ్ వచ్చిందన్నారు".

"సినిమాకి కాదులే. వెంకటాద్రీ నువ్వు బుక్ రీడింగ్ ని ఎందుకు అలవాటు చేసుకో లేదో నాకు తెలియదు. చాలా మిస్ అవుతున్నావు".

"అలా జరిగిపోయింది. రేపు ఆ పుస్తకం గురించి చెప్పు. ఆరుగురు అనుమానితులు అంటున్నావు కదా. పేరు ఇంట్రెస్టింగ్ గా వుంది. ఏంటి కథ?"

"అదో మర్డర్ మిస్టరీ. నేను చదవాలి".

"అంటే డబ్బు చుట్టూ తిరుగుతుందా?"

"అనుమానం ఏముంది వెంకటాద్రి. మనుషుల హత్యలన్నీ డబ్బు చుట్టూ, అధికారం చుట్టూ, స్త్రీ చుట్టూ తిరుగుతుంటాయి. ప్రధానంగా ఇవి. ఇంకా చాలా వున్నాయి. అన్నిటిలో కామన్ అంశం డబ్బు".

"నువ్వు చదివాక ఇవ్వు. నేను చదువుతాను".

''అలాగే''.

ఇంటి దగ్గరకు వెళ్లే సరికి గోడ దగ్గర పక్క ఇంటి వారితో కళ్యాణి మాట్లాడుతోంది. తను వెళ్లి స్నానం చేసి వచ్చాడు.

''ఈ రోజు అబ్బాయికి, అమ్మాయికి పాతనోట్లు దొరికాయని చెప్పాను'' అంది కళ్యాణి.

''ఎందుకు చెప్పావు. వాళ్లు చదువుకుంటున్నారు. ఇది విన్నాక ఇలా అయిందేంటి అని బాధ పడతారు. అయినా నీకు అంత తొందర ఏంటి? ఇంటికి వచ్చినప్పుడు మెల్లగా చెబుతాం. ఇప్పుడు పక్కింటావిడకి కూడా చెప్పేశావా?''

''ఎందుకు చెబుతాను. పిల్లల దగ్గర రహస్యాలు వుండకూడదని చెప్పాను'' అంది కళ్యాణి.

''కొన్ని రహస్యాలు వుండాలి. అది పిల్లల మధ్య కావచ్చు. పెద్ద వాళ్ల మధ్య కావచ్చు. ఎప్పుడు చెప్పాలి. ఎంత వరకు చెప్పాలి అనేది మనం తెలుసుకోవాలి. సర్లే. ఇద్దరూ ఏమన్నారు?''.

''అలా ఎలా జరిగింది అన్నారు. బాధపడ్డారు. మీరు దీని గురించి ఎక్కువ ఆలోచించకండి అన్నాను''.

''మంచి పని చేశావు'' అన్నాడు.

ఈ రోజు నిరంజన్ విషయం కళ్యాణితో మాట్లాడాలనిపించలేదు. టీ.వీ. ఆన్ చేశాడు. వార్తలు వింటున్నాడు. అప్పుడు అదిరిపోయాడు. అయిదు లక్షల విలువగల దొంగనోట్లను పట్టుకున్నారంట! అందులో రెండు వేల రూపాయల నోట్లతో పాటు అయిదు వందల రూపాయల కొత్త నోట్లు వున్నాయి.

అప్పుడే కొత్త కరెన్సీని ప్రింట్ చేస్తున్నారన్న మాట. అవి పాకిస్థాన్ నుండి వస్తున్నాయా? కలర్ జెరాక్స్ మెషిన్ తో తయారు చేస్తున్నారా? ఏ మాత్రం తేడా లేకుండా దొంగనోట్లు వస్తున్నాయంటున్నారు. అలాంటి వాటిని బ్యాంక్ వాళ్లు గుర్తించగలరు.

అంటే...

వెంకటాద్రికి వార్తలు వినిపించటం లేదు.

అతని మనసులోకి రకరకాల ఆలోచనలు వేగంగా వస్తున్నాయి. అతనో చిత్రాన్ని వూహిస్తున్నాడు!

వెంకటాద్రి, శివకృష్ణ వాళ్లు వాకింగ్ చేసే ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందలేదు. అందుకు కారణం వుంది. అదంతా ఓ ఫ్యాక్టరీ వారి స్థలం. ఇంకో పక్కన కొండలు. మరో పక్కన ఆ చుట్టు పక్కల కాలనీల మురికి నీరు అంతా వస్తుంటుంది. ఓ పక్కన పొలాలు. అప్పుడప్పుడు రకరకాల పంటలు పండించటం కనిపిస్తుంది. ఒక్కోసారి ఆ ప్రాంతమంతా ఎండిపోయిన గడ్డితో కనిపిస్తుంటుంది. మరో చోట కొండరాళ్లు. ఇంతకు ముందు ఫ్యాక్టరీ నడిచినప్పుడు కూడా ఆ ప్రాంతంలో అంత హడావుడి వుండేది కాదంటారు. కొన్ని వందల ఎకరాలున్నాయి. అందులో చెట్లు పెంచారు. తారు రోడ్లు వున్నాయి. ఇప్పుడు ఫ్యాక్టరీ నడవటం లేదు.

ఆ భూములను ఆనుకుని మెయిన్ రోడ్ వుంటుంది. వాటి గురించి రకరకాల కథనాలు వస్తుంటాయి. భూముల విలువ కోట్లలో వుంటుంది. ఆ భూముల్లో నిర్మాణాలు చేపడతారని కొందరు అంటారు. అవన్నీ కోర్టుల్లో వున్నాయి. అవి తేలటానికి సమయం పడుతుంది. లేకుంటే ఇప్పటికే ఈ ఏరియా చిత్రం పూర్తిగా మారిపోయి వుండేది అంటారు.

ప్రస్తుతం మాత్రం కొంతమంది వాకర్స్ కి ఉపయోగపడుతోంది. ఇంక డబ్బు విషయానికి వస్తే ఇది దొంగనోట్ల వ్యవహారం అయివుండాలి. ఇలాంటి వాటి సెటిల్ మెంట్లు ఈ ప్రాంతాల్లోనే జరుగుతాయి. బహుశా ఈ విషయం లీక్ చేసి వుంటారు. పోలీసులు వారిని వెంటాడుతున్నప్పుడు ఈ బ్యాగ్ ని బయటకు విసిరేసి వుంటారు. ఈ ప్రాంతాన్ని గుర్తు పెట్టుకుని వుంటారు. అంటే ఈ డబ్బుల కథ ఇంతటితో ముగించరు.

అతను టీ.వీ. కట్టేసి మెట్లెక్కి రూఫ్ మీదకి వెళ్లాడు.

ఇది సినిమా కథలా అనిపిస్తూంది. నిజానికి సినిమాకి, వాస్తవ జీవితానికి మధ్య గీతలు ఎప్పుడో చెరిగిపోయాయి. కాస్తో కూస్తో మిగిలివున్నా అవీ చెరిపేస్తున్నారు. సినిమాల్లో చూపించని, కథల్లో రాయని సంఘటనలు అప్పుడప్పుడు వినాల్సి వస్తోంది. అప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. షాక్ కలుగుతుంది. ఇప్పటి సమస్య–తన దగ్గరున్నది దొంగనోట్లా? అది ఎలా తెలుసుకోవాలి. అంటే ముందు అందులో కొంత డబ్బుని తీసి ఖర్చు పెట్టాలి.

పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ కి వెళ్లవచ్చు. సరదాగా ఓ లక్ష రూపాయలు ఖర్చు చేయటం నిమిషాల్లో పని. అక్కడ వారు కూడా దొంగనోట్లను గుర్తు పట్టగలుగుతారు. అనుమానం వస్తే పోలీసులకు ఫోన్ చేస్తారు. తర్వాత లాకప్పులూ, ఇంటరాగేషన్లూ, పత్రికల్లో టీవీల్లో వైరల్ కావటం, ఇవన్నీ తలనొప్పులు. అలా అని చిన్న చిన్న వాళ్లు రెండు వేల రూపాయలు తీసుకోవటానికి ఒకటికి నాలుగుసార్లు చూస్తారు. చిల్లర లేదంటారు. అతను ఆలోచించాడు.

తనకి యాక్టివా స్కూటర్ వుంది. పెట్రోల్ కొట్టించి డబ్బులు ఇవ్వాలి. అందులోనూ కాస్త రద్దీగా వుండే చోట అయితే మంచిది. వాళ్లు డబ్బులు కలెక్ట్ చేసుకునే హడావుడిలో వుంటారు. చాలా మంది పెద్దగా పట్టించుకోరు. అయినా ఈ మధ్య కాలంలో రెండు వేల రూపాయల నోట్లు వచ్చాయి. ఇంత త్వరగా దొంగనోట్లు బయటకు రావటం కష్టం!

ఇంకో రకంగా జరిగివుంటుందా?

వెంకటాద్రి మనసు మరో రకంగా ఆలోచించటం మొదలుపెట్టింది. ఈ ప్రాంతానికి చెందిన డబ్బు అయి వుండదు. అది బ్యాంక్ దొంగతనం కావాలి. ఆ డబ్బుని ఇటు తరలించి వుంటారు. తన దగ్గరున్న డబ్బు బండిల్స్ గానే వుంది. తను గమనించలేదు గాని సీరియల్ నెంబర్లు వుంటాయి. అంటే వీటిని గుత్తగా బ్యాంక్ లో వేయాలంటే వాళ్లు నెంబర్లు గుర్తు పడతారు.

అంటే దీని వెనకాల చాలా ఎక్సర్ సైజ్ వుంది. ఇప్పుడు తన ముందున్నది రెండు మార్గాలు. మొదటిది ఇవి దొంగనోట్లా, అసలయినవా అని తేల్చుకోవటం. రెండు వీటిని ఏ బ్యాంక్ నుండయినా దోచిన బాపతా? హవాలా డబ్బా.

ఇవి తేలకుండా తొందరపడకూడదు. కాకపోతే ఇక్కడి సమస్య–తను ఈ పనుల్ని ఒంటరిగా చేయాల్సి వుంది. బయటి వారికి తెలిస్తే ప్రమాదం.

అసలు మనుషుల్లో విచిత్రమైన ప్రకృతి వుంది. తమకు ఓ కొత్త విషయం తెలిస్తే, అది మంచిది కావచ్చు, చెడు కావచ్చు. ఇంకొకరికి చెప్పే వరకు అసహనంగా వుంటుంది. అది అలా ఓ నోటి నుండి మరో నోటికి పాకుతుంది. అక్కడ నుండి రకరకాల కథనాలను జోడిస్తారు. నిజం కంటే కల్పన మరింత రసవత్తరంగా వుంటుంది.

వెంకటాద్రికి అప్పటికప్పుడు శివని కలిసి మాట్లాడాలనుంది. అంతలోనే అనిపించింది. త్వరపడకు. అధ్యయనం చెయ్యి, విశ్లేషించు, పందెం గెలువు అంటారు. ఆలస్యం అమృతం, విషం అన్నారు. ఆలస్యం విషంగా మారే సందర్భాలు అరుదుగా వస్తుంటాయి. ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవలసి వుంటుంది. ఎక్కువ సందర్భాల్లో ఆలస్యం అమృతం అవుతుంది.

తన దగ్గరుంది అమృతమో, హాలాహలమో తెలియదు. రెండిటినీ భరించగల శక్తిని పెంచుకోవాలి. రేపు ఎటూ శివ కలుస్తాడు. అప్పుడు మాట్లాడుకోవచ్చు. డాబా మీద నుండి కిందకు వచ్చాడు.

కళ్యాణి ఎదురు చూస్తోంది.

"ఎక్కడికి వెళ్లారు?" అంది.

"డాబా మీదకు వెళ్లాను".

"మనం ఆ డబ్బు గురించి మరిచిపోదామండి"

"ఏ డబ్బు గురించి నువ్వు మాట్లాడుతున్నావు?"

"అదేంటి అలా అంటారు. మన దగ్గర ఎంత డబ్బు వుంది. అరకోటి వుందా? కోటి వుందా? ఏభైవేల పాత నోట్ల గురించి మాట్లాడుతున్నాను".

వెంకటాద్రి ఉలికిపాటుని కప్పి పుచ్చుకున్నాడు.

"మరిచిపోక మనం చేయగలిగిందేముంది".

"మనం ఎవరికీ తెలిసి అన్యాయం చేయలేదు. ఇతరుల డబ్బుని మనం ఆశించలేదు. మన రూపాయి విషయంలో మనం జాగ్రత్తగా వున్నాం. అన్నీ భగవంతుడు పై నుండి చూస్తుంటాడు. మనకి అన్యాయం చేయడు. అట్టుకి అట్టున్నర పై నుంచి పంపిస్తాడు" అంది కళ్యాణి.

"అంటే మూట విసురుతాడంటావా?"

"ఏదో సామెత చెబుతారు. గుర్రం గాల్లో ఎగరానూ వచ్చు అని. దేవుడు తలుచుకుంటే ఏదయినా జరుగుతుంది. మూటలే పంపిస్తాడో, ఇంకేదన్నా రూపంలో పంపిస్తాడో మనం చెప్పగలమా?"

"అప్పుడయినా అది వేరే వాళ్ల డబ్బు అవుతుంది కదా!"

"అది ఆయనకు తెలియదా. మన నుదుటి మీదే దేవుడు మన జాతకం రాస్తాడు. తినే అన్నం మెతుకు మీద రాస్తాడు. అలాగే మనకి పంపే డబ్బు మీద రాస్తాడు. డబ్బు అంటేనే నలుగురి చేతుల్లో అటూ ఇటూ మారటం".

"మనుషులు తమకు బాధ కలిగినప్పుడు ఓదార్చుకోవటానికి రకరకాల సామెతలుంటాయి. తత్వాలు వుంటాయి. నువ్వు చెప్పే వాటితో నేను విభేదించటం లేదు. జరిగిందేదో జరిగింది. అందుకు నేను కారణమో, నువ్వో ఎవరికీ గుర్తు లేదు. అందుకని నువ్వు, నేనూ కూడా ఆ విషయం మరిచిపోదాం... అలాగే మీ తమ్ముడికో, ఫ్రెండ్స్ కో కూడా ఇది చెప్పకు. సానుభూతి చెప్పరు. నవ్వుకుంటారు" అన్నాడు వెంకటాద్రి.

"అలాగే" అంది కళ్యాణి.

శివ, వెంకటాద్రి నడక పూర్తి అయ్యాక ఓ చోట కూర్చున్నారు.

"నవల ఎంతవరకు చదివావు?" అడిగాడు వెంకటాద్రి.

"సగం పైగా అయింది. చదువుతుంటే అస్సలు పుస్తకం పక్కన పెట్టాలనిపించటం లేదు. అలా పరుగులు తీస్తూనే వుంది. ఇండియన్ బ్యూరాక్రసి మీద ఈ రచయితకి ఎంత పట్టు వుందో. మనం ఎంత అమాయకత్వంలో బతుకుతున్నామో ఇది చదివాక తెలుస్తోంది".

"అంటే....!"

"రాజధాని నగరంలో ఏం జరుగుతుందో మనకు తెలియదు. మనం కేవలం నీటిలో పైకి తేలిన శిఖరపు అంచులు చూస్తున్నాం. కింద కొన్ని మహా పర్వతాలున్నాయి. ప్రతి రోజూ కొన్ని వేల కోట్ల రూపాయలు ఎలా చేతులు మారుతుంటాయో, రాజకీయ నాయకుల ఎత్తుగడలు ఎలా వుంటాయో, సినిమా వాళ్ల ప్రపంచం ఎలా వుంటుందో చదివి తీరాలి. ఇవన్నీ దగ్గరగా చూస్తే తప్ప రాయటం కష్టం".

"మన తెలుగులో ఇలాంటివి రావటం లేదా?"

శివ మాట్లాడలేదు. అతను ఆలోచనలో పడ్డాడు.

'మన వాళ్లకి అంత అనుభవం లేదు. అంత లోతుగా పరిశోధన చేయాలని కూడా లేదు. మన కమర్షియల్ రచయితలు ఆంగ్ల నవలల మీద ఆధారపడ్డారు. మన పాఠకులకి ఇలాంటి నవలలు, సాహిత్యం అందుబాటులోకి వస్తుంటే తేడా తెలుస్తుంది. అయినా నేను ఈ విషయంలో ఎలాంటి కామెంట్ చేయను. మన వాళ్లకి క్రియేటివిటీ కంటే అనవసర విషయాలను చర్చించటం ఇష్టం".

"నాకూ ఆ పుస్తకం చదవాలని వుంది".

"అలాగే. ఇందులో ఓ పాత్ర వుంది. అది చదువుతుంటే నువ్వు గుర్తొచ్చావు".

"నిజమా!"

"అవును. ఓ సెల్ ఫోన్ దొంగ వుంటాడు. అతను ఓ ఫోన్ ని దొంగతనం చేస్తాడు. అప్పుడే ఓ ఫోన్ వస్తుంది. ఫలానా చోట, ఓ చెత్త కుండీలో సూట్ కేస్ వుంది. అది తీసుకోవాలి అని. అతను అక్కడికి వెళ్తాడు. నిజంగానే అక్కడ వుంది. అనుమానం వస్తుంది. అందులో బాంబులాంటిది వుందా అని. దాన్ని తెరవగానే కళ్లు బైర్లు గమ్ముతాయి. తన జీవితంలో వూహించని డబ్బు" అని ఆగాడు.

వెంకటాద్రి చేష్టలుడిగి చూస్తున్నాడు.

"ఏమైంది? " అన్నాడు శివ.

"ఏం లేదు. ఏం లేదు".

'నడుస్తుంటే ఆరడుగుల పాము పడగవిప్పి ఎదురుగా బుసకొడుతున్నట్లు ముఖం పెట్టావు. ఇందులో ఇంత కంగారు పడాల్సిన అవసరం, సందర్భం వుందా? నువ్వు ఇలాంటి విషయాలు అడుగుతుంటావు కదా!"

"ఏదో గుర్తు వచ్చింది. అయినా ఫోన్ దొంగతనం చేయటం, అంతలో ఎక్కడి నుండో ఫోన్ రావటం, సూట్ కేస్ దొరకటం అంతా థ్రిల్లింగ్. ఇలా జరిగే అవకాశం వుందా?" సర్దుకుని అన్నాడు.

"ఎందుకు వుండదు. అందుకే ముందే చెప్పాను. అరుదుగా జరిగే వాటి గురించి పాఠకులు నమ్మరు. కాని వాస్తవం కల్పన కంటే నమ్మశక్యం కాకుండా వుంటుంది – కొన్ని సమయాల్లో. మనకు నగరాల గురించి తెలిసింది చాలా తక్కువ. అందులోనూ యు.పి. మహారాష్ట్ర, ఢిల్లీ లాంటి చోట్ల వున్న మాఫియాల గురించి అస్సలు తెలియదు. నువ్వు ముంబయ్ వెళ్లు. కొల్ కతా వెళ్లు. అక్కడి స్లమ్స్ చూడాలి. నేను ఇంటి దగ్గర మాత్రమే కూచుంటాను. నేనూ నా చిన్ని కుటుంబం అంటే ఇలానే వుంటుంది".

"సరే... సరే... తర్వాత ఏం జరుగుతుంది?"

"అంత డబ్బు చూసినప్పుడు, అందులోనూ సామాన్య దొంగ ఎలా ఆలోచిస్తాడు. అతని జీవితం ఎలా మారుతుంది? లైఫ్ స్టయిల్ ని ఎలా మార్చుకున్నాడు. అప్పటిదాకా సప్రెస్ చేసుకున్న తీరని కోరికలు ఎలా ఎగిసిపడ్డాయి – ఇవన్నీ వుంటాయి. అంతేకాదు డెస్టినీ కొత్త వ్యక్తుల్ని ఎలా పరిచయం చేస్తుంది. దాని పరిణామాలు ఏంటి? ఆరుగురు అనుమానితుల్లో ఇతను ఒకడు ఎలా అయ్యాడు. ఇదంతా కథ".

"సొంతం చదవలేదన్నావు. ఇంతకీ ఆ సూట్ కేస్ వెనక ఎవరున్నారంటావు? అది నీ ఊహకు అందుతుందా?"

"ఇంకెవరుంటారు. మాఫియా వుంటుంది. డ్రగ్ మాఫియాది ఇందులో ప్రధాన పాత్ర. అలాగే హ్యూమన్ ట్రాఫికింగ్. అంతే కాదు సవాలక్ష మాఫియాలు ప్రపంచంలో వున్నాయి. ఆకాశం నుండి మొదలై భూమ్మీద వరకు. గంధం, ఎర్రచందనం, ఏనుగు దంతాల నుండి నక్షత్ర తాబేళ్ల వరకు. భూమిపైనా, భూమి లోపలా లేని మాఫియా అంటూ లేదు వెంకటాద్రీ... చివరకి ఏడు కొండల నుండి దేశంలో వున్న ఏ పుణ్య క్షేత్రం చూడు. కాశీలాంటి చిట్టచివరి మజిలీ దాకా టెంకాయ నుండి కిడ్నీలు అమ్ముకోవటం దాకా అన్ని చోట్లా వున్నాయి".

''నువ్వు మాట్లాడుతుంటే నాకు భయంగా వుంది''.

''మనుషుల మధ్య బతుకుతున్నాం అనుకున్నాను. మాఫియాల మధ్య బతుకుతున్నాం అనా!''

''అంతేకదా! మనం సినిమాల్లో చూసే దాదాలు మాత్రమే కాదు. అడుగడుగునా వారే వున్నారంటే భయం కలగదా!''

''చెబుతున్నాను కదా. సాధారణ జీవితం గడిపేవారికి ఇలాంటి సమస్యలు ఎదురుకావు. ఎప్పుడయితే మన జీవితంలోకి డబ్బు ప్రవాహం మొదలవుతుందో, దాన్ని ఇన్ వెస్ట్ చేయాలనుకున్న క్షణం నుండి నిన్ను వెయ్యి కళ్లు గమనిస్తుంటాయి''.

''ఈ కథలో అసలు నిజం అంటే – తమ సూట్ కేస్ పోయిందని వారికి తెలుస్తుంది కదా! తర్వాతేం జరుగుతుంది?''

''మామూలుగా మనం అనుకుంటాం. అంత మహా నగరంలో ఓ చిన్న దొంగని పట్టుకోవటం సాధ్యం అవుతుందా అని. దొంగలందరూ ఒకటి కాదు. ఒకే తరహా దొంగతనాలు చేయరు. సెల్ ని పారేసినా, సిమ్ములు తీసినా, అక్కడ సి.సి. కెమెరాలు వుండకపోయినా మాఫియా వారు అంత తేలిగ్గా వదిలిపెట్టరు. వారి పద్ధతులు వారికుంటాయి. ఓ రకంగా చెప్పాలంటే మన నేర పరిశోధన శాఖలు చాలా వున్నాయి. అలాంటి వాటికి వీళ్ల నెట్ వర్క్ తీసిపోదు. అందుకని అబ్బాయి గారు దొరక్కపోవటం అంటూ వుండదు''.

''అప్పుడేం చేస్తాడో''.

''ఈ లోపు చాలా సంఘటనలు జరిగిపోతాయి కదా! ఇదో విషపు కూడలి వెంకటాద్రి. దుబాయ్, లండన్, ఇంకా అనేక దేశాల నుండి ఈ నెట్ వర్క్ లు నడుస్తుంటాయి. ఈ మధ్య మన దగ్గర కూడా నైజీరియా గ్రూప్స్ మొదలు అయ్యాయి. డ్రగ్స్ దందా నడుస్తోంది. అదే కాదు చెయిన్ స్కీమ్స్ ప్రతి చోటా కనిపిస్తున్నాయి. అందుకని మనం దేనికీ టెంప్ట్ కాకూడదు. మనకున్నదాంతో తృప్తి పడటం ఓ పద్ధతి. కాదంటే మనం కాస్త మొద్దు బారాలి. ఏదైనా ఫేస్ చేయటానికి సిద్ధంగా వుండాలి''.

''ఏది ఏమైనా బతకటం చాలా కష్టమే''.

''చెప్పాను కదా. సమాజం అంతా ఇలా క్రిమినల్స్ గా మారితే అప్పుడెలా వుంటుందో పూర్తిగా చెప్పటం కష్టం. అతి తక్కువ శాతం మంది ఈ రంగాల్లో వున్నారు. మిగతా వారందరికీ ఎవరి ప్రపంచం వారికి వుంది. నాకు కొన్ని కోరికలున్నాయి. ఫిలాసఫి వుంది. అలా బతికే ప్రయత్నం చేస్తుంటాను. మిగతావారూ అంతే. అందుకని ఇలాంటి వాటి గురించి మనం పట్టించుకోం. అంత సమయం వుండదు. బతకటం కష్టమే కాదు. సులభం కూడా!''

ఆశ్చర్యంగా చూశాడు వెంకటాద్రి.

''అవును. అందరూ బతుకుతున్నారు కదా. మన జనాభా ఇన్ని పదుల కోట్లకు చేరింది. అందులో బతకలేక చనిపోయే వారున్నారు. వారి శాతం చాలా తక్కువ. అందుకని మనకి ఎలాంటి జీవితం కావాలో మనం నిర్ణయించుకోవాలి'' అన్నాడు.

ఇంటికి వచ్చాడు వెంకటాద్రి.

మనసు మనసులో లేదు. శివకృష్ణ మాటలు వెంటాడుతున్నాయి. అతని మాటల్లో అతిశయోక్తి వుందా అనిపించింది. అతను చెబుతున్నంత భయంకరంగా వుందా జీవితం! ఇంతకు ముందు కంటే ఇప్పుడు డబ్బు చలామణి పెరిగింది. ముందు ఆదాయం పెరిగింది. అనేక మంది విదేశాలు వెళ్తున్నారు. అక్కడ సంపాదించి పంపిస్తుంటే ఇక్కడ ఆస్తులు కొంటున్నారు. చదువులు చెప్పించటానికి, పెళ్లిళ్లు చేయటానికి యిబ్బందులు పడిన వారు కూడా పిల్లల వల్ల ఇప్పుడు రిచ్ గా బతుకుతున్నారు.

ఒక్కొక్కరికి రెండు మూడు ఇళ్లు వుంటున్నాయి. స్థలాలు కొంటున్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న వారు లక్షలకి లక్షలు సంపాదిస్తున్నారు. ఇవన్నీ కళ్ల ముందు కనిపిస్తున్న నిజాలు. అతను పిరికి మందు పోస్తున్నాడని కాదు. ఇన్ జనరల్ గా అతను మాట్లాడుతున్నాడు. శివ చెప్పే ప్రతి అంశాన్ని తను పోల్చుకోనవసరం లేదు.

తను ఎకౌంట్స్ లో నిష్ణాతుడు కాదు. కేవలం కామర్స్ గ్రాడ్యుయేట్. అదే ఛార్టడ్ అకౌంట్స్ చదివితే వేరేగా వుండేది. చిన్న ఉద్యోగంతో తృప్తి పడ్డాడు. మెల్లగా ఎకౌంటెంట్ పోస్ట్ నుండి ఆఫీసర్ గా ప్రమోట్ అయ్యాడు. తనే కాదు. చాలా మంది అసిస్టెంట్ ఎకౌంట్స్ ఆఫీసర్స్ అయ్యారు. అప్పట్లో అనేక బ్రాంచీలు పెట్టారు. అక్కడ పని చేసే వారికి ఎకౌంట్స్ తెలియవు. అయినా చిన్న చిన్నవే. తప్పుల నుండి మెల్లగా నేర్చుకున్నారు.

కొంతమంది జీతాలు ఇవ్వటం, పెన్షన్ల లెక్కలు చూడటం లాంటివి చేశారు. కంప్యూటర్లు వచ్చాక పరిస్థితి మారింది. అయినా కార్పొరేషన్స్ లాంటి చోట లెక్కలను తిమ్మిని బమ్మిని చేయటం వుండదు. ఇంటర్నల్ గా ఆడిట్ వుంటుంది. ఇక్కడ 'ఏ' 'బి' పుస్తకాలు వుండవు. ఇవన్నీ అలా వుంటే తన దగ్గర వున్నది కేవలం ఏభై లక్షలు. వీటిని వినియోగించలేడా? రేపు పిల్లలు సంపాదించటం మొదలు పెడతారు. అవి లక్షల్లో వుండవు, త్వరగానే కోట్లకి చేరతాయి.

అంతదాకా ఎందుకు... ఏ చదువూ సంధ్యలేని వారు ఒకరిద్దరు తమ బంధువుల్లో వున్నారు. అందులో ఒకరు ఫ్యాక్టరీలు పెట్టారు. ఒకటి హైదరాబాద్ లో వుంది. పది సంవత్సరాలు అయ్యాక నెల్లూరు దగ్గర ఇంకోటి పెట్టాడు. ఇంగ్లీష్ మాట్లాడటం రాదు. అతను చదివింది పదో తరగతి. ఇంకో వ్యక్తి ఎనిమిదో తరగతి. స్థలాలు, ఇళ్లూ కొనటం, అమ్మటం చేస్తుంటాడు. ఇప్పుడు సిటీలో తనకి ఇరవై అపార్ట్ మెంట్స్ వున్నాయి. లక్షల్లో అద్దెలు వస్తున్నాయి. ఒకటి రెండు బిజినెస్ కాంప్లెక్స్ ల్లో వాటాదారుడు.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS